




జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# ది గ్రాండ్ కెన్యన్

దేశెట్టి కేశవరావ్

రాత్రి పదిగంటలయింది. నిద్రరాక మంచం మీద దొర్లుతున్నాను.

తలుపు చప్పుడయ్యింది.

ఇవాళప్పుడు నా కోసం వచ్చేవాళ్ళెవరూ లేరు, ఒక ప్రసాద్ తప్ప. వాడికి అర్జంటుగా డబ్బుతో అవసరం పడుతూంటుంది. ఆ అవసరానికి వేళాపాళా వుండదు. అర్ధరాత్రి, అపరాత్రి కూడా డబ్బుకోసం వచ్చిన సంఘటనలెన్నో వున్నాయి.

మళ్ళీ తలుపు చప్పుడు. లేవ బుద్ధికాలేదు. పక్కన పడివున్న హెరాల్డు రాబిన్సు తాకితేనే వొళ్ళు తిమ్మిరెక్కుతోంది. నైట్‌లాంపు వెలుతుర్లో అట్టమీద సుందరి నవ్వు చూస్తోంటే వొంట్లోంచి ఆవిర్లు వస్తున్నాయి.

చీకటిలో తడబడుతూ లేచాను. మళ్ళీ తలుపు చప్పుడయింది వీణ్ణి వదిలించుకోవడం కష్టం. వాడికివ్వడానికి చిల్లరనోట్లెన్ని వున్నాయా అని ఆలోచిస్తూ లేచి స్విచ్చి వేశాను. వెళ్ళి తలుపు తీశాను.

గుప్పున సన్నజాజుల వాసన. గుడ్డి వెన్నెల్లో గుమ్మం ముందు నిలబడివుంది వెన్నెల కన్యలా ఆమె.

"నేనే! ఏమిటలా చూస్తావ్? అవతలకి జరుగు!" నన్ను తోసుకుంటూ లోపలికొచ్చింది. అదే హస్కీ వాయిస్. వొళ్ళు కంపరమెత్తుతుంది నాకు ఆ కంఠం వింటే కవ్విస్తున్నట్టుంటుంది ఆ కంఠంలో జీర.

గదినిండా యింటిమేట్ పరిమళాలు. సన్నజాజుల గుబాళింపు. క్రీం కలర్ నైలెక్స్ శారీలో, ముఖాన ఎల్లోకలర్ తిలకంతో చల్లని చంద్రరేఖ నేలని తాకినట్టుగా వుంది.

"వసంతా! నువ్వా!" ఆశ్చర్యంతో గొంతు పెగలకపోతే, ఎలాగో అనగలాను.

"అవును! నేనే! ఏమిటంత యిదయిపోతున్నావు? తలుపు గడియవేసి ఇలా వచ్చి కూర్చో!" సోఫామీద జారగిలబడి, కాళ్ళు సుతారంగా ఆడిస్తూ అంది. మంచంమీద కూచోమన్నట్టు చేత్తో చూపింది.

"ఈ సమయంలో! ఇంతరాత్రి!....ఎవరూ చూళ్ళేదు కదా!" తత్తరపాటులోంచి తేరుకోకుండానే, తలుపు గడియవేసి సోఫా దగ్గర కొచ్చి ఆందోళనగా అడిగాను.

రాబిన్సు పుస్తకం అందుకుని బొమ్మని చూసి, సోఫామీద గిరాటేస్తూ అంది: "వెధవ దేవదాసు డైలాగులు పలికించకు!! నాకు పరమ బోరుగా వుంటుంది!" అంది. సోఫా వెనక భాగంమీద రెండు పక్కలా చేతులు చాపి, కాళ్ళు తమాషాగా ఆడిస్తూ అంది.

అచేతనంగా మంచంమీద కూలబడిపోయి ఆమెనే చూస్తూ కూర్చున్నాను.

"కభీతన్ హోయియో మేతుమ్....తుమ్ హోరీయాద్ ఆయెగీ...." ఎప్పటిదో పాట. హమ్మింగ్ చేస్తోంది. ఆమె హస్కీ వాయిస్‌కి సరిగా సరిపడే పాట. ఆ మాటే ఆమెతో చాలాసార్లు అన్నాను. ముబారక్ బేగం ఏమయిందో పాపం. సంగీత రసజ్ఞులకి తీరని తాపాన్ని వదలి మాయమైపోయింది.

"ఇక ఆ బుద్ధావతారాన్ని చాలించి ఏమన్నా కబుర్లు చెప్పు!" అంది. ఏమిటి యీమె అభిప్రాయం? ఈ పరిస్థితికి అర్థం ఏమిటి?

"ఈ సిచుయేషన్ షాకింగ్‌గా వుంది: కొంత తేరుకోనీ!" అన్నాను.

"అందుకేనోయ్ అన్నాను. మగవాడన్న వాడు కొంత విస్కీ తాగడం నేర్చుకోవాలి! అప్పుడిలాంటి షాక్‌లకి యిమ్యూన్ అయిపోతావు" అంది నవ్వుతూ. అందెలు రవళించినట్టు కీచూ బొంగురూ కలిపిన నవ్వు.

"నిన్ను చూస్తుంటే యింకా విస్కీ ఎందుకు?" అన్నాను.

"ఫరవాలేదే! పనికొస్తావు!" అంది. కాస్త ఆగి "ఎంత ఆఫీసరువయినా నీ మిడిల్‌క్లాస్ మొరాలిటీ పోలేదు సుమా!" అంది నవ్వుతూ.

"ఏం చేస్తాం! మనం పెరిగింది అలాగ. ఈ ప్రూడరీ మన నరనరాల్లో జీర్ణించుకుపోయింది!" అన్నాను.

ఆమె నవ్వింది. "నువ్వు లేపాక్షి చూశావా?" అనడిగింది వున్నట్టుండి.

"ఊఁ!" అన్నాను.

"అదీ నీలాంటి భగ్నప్రేమికుడే శిల్పించి వుంటాడు. అందుకే పూర్తి చెయ్యలేకపోయాడు!" అంది.

"అదికాదు!" అనబోయాను. ఆ శిల్పం అసంపూర్తిగా వుండడానికి కారణమేమిటో నేను చెప్పగలను. నేను చెప్పబోయేది సత్యం కావచ్చేమో! ఆమె చెప్పింది మాత్రం కవిత్వం!

ఆమె లేచి నిలబడింది. "నువ్వు మాత్రం విచిత్రమైన ప్రేమికుడివి! అవకాశం వుపయోగించుకోవడం తెలీని అమాయకుడివి!" డ్రస్సింగ్ టేబిల్ వద్దకి వెళ్ళి, అద్దంలో ప్రతిబింబాన్ని చూసుకుంటూ అన్నది.

## రచయిత గురించి

చదివింది ఎం.ఏ. బి. యిడి. ఉద్యోగం అనంతపురం జిల్లా హిందూపూర్‌లో. యింతకు ముందు చేసినవన్నీ హాస్య రచనలే. సీరియస్‌గా రాసిన తొలి కథ యిదే. దీనికి 'జ్యోతి' ప్రత్యేక బహుమతి లభించడం సంతోషకరంగా వుంది. ఫోటో పత్రికలో ప్రచురించడం యిష్టంలేదు.

అకస్మాత్తుగా సీరియస్‌గా అయిపోయి, "వెధవ ప్రూడరీ! మనుషుల్ని తినేస్తుంది. బ్రతుకుల్లో ఆనందమూ, వికాసమూ లేకుండా అడ్డుపడుతుంది. మురికీ, కాలుష్యమూ, రోగమూ, మర్యాదా, నియమాలూ, కుళ్ళిన కంపుకొట్టే నీతీ-యివేనా బ్రతుక్కి అర్థం?" అంది.

"అంతేనేమిటి? యింకా యెంతో వుంది!" అన్నాను. బ్రతుకులో ఆనందం వుంది, ప్రేమ వుంది, త్యాగముంది, కలలున్నాయి, తృప్తి వుంది, మల్లెపూలున్నాయి, వెన్నెల వుంది, చెప్పాలనుకున్నాను చెప్పలేకపోయాను. గొంతుముడి విప్పుకోలేక పెనుగులాడుతోంది.

"ఊఁ! చెప్పు!" అంది.


"చెప్పాలంటే చాలా వుంది," అన్నాను. అవకాశం! వుపయోగించుకోవడం. దేన్ని గురించి ఆవిడ అంటున్నది?

ర ర ర

అప్పుడు నేను టెన్త్‌క్లాసు చదువుతున్నాను. వసంతావాళ్ళు మా యింటి మేడమీద వాటాలో అద్దెకుండేవాళ్ళు. సాయంత్రమయితే మా యింట్లోని గదిలోనే కుర్రాళ్ళమందరమూ చదువుకోడానికి చేరేవాళ్ళం. మా కుటుంబాలు రెండూ కలివిడిగా వుండేవి.

ఆ రోజు వర్షం తుంపరగా పడుతోంది. గదిలో కూర్చొని లైటు వేసుకుని లెక్కలతో కుస్తీ పడుతున్నాను. వసంత వచ్చింది. ఆమె వెంట ఇద్దరు తమ్ముళ్ళూ వచ్చారు. వాళ్ళిద్దరూ అయిదూ నాలుగూ కాబోలు చదువుతున్నారు.






"వెళ్దామా?" అన్నాను.

చుట్టూ చూసి మాట్లాడకుండా నీళ్ళలోంచి ...చి వచ్చింది నిట్టూరుస్తూ.

దైవదర్శనం అయ్యాక ఆడవాళ్ళంతా వంట...కి దిగారు. మగాళ్ళు వంటకి చితుకులు పోగు...సి—అదయ్యాక పిచ్చాపాటిలోకి దిగారు. ...ందరు పేకాటలో కూర్చున్నారు. కుర్రకారు ...మామిడిపళ్ళకోసం దూరంగావున్న తోటల్లోకి ...రిగెత్తారు. నేను ఏమీ తోచక దూరంగావున్న ...టలో కొమ్మన పండిన పళ్ళేవైనా దొరుకుతా...మోనని వెళ్ళాను. వెళ్తోంటే, పట్టుచీర గరగరలతో నాతో కావాలనే దోబూచులాడుతున్నట్టు, సత్రం బయటికి వస్తూ లోపలకి వెళ్తూ బిజీగా తిరుగుతున్న వసంతని చూశాను. అలా ఆమెని గమనిస్తూనే ముందుకి నడిచాను. అరమైలు దూరంగా వున్న మామిడితోపుకేసి వెళ్ళాను.

"మరీ అంత ఎక్కువ తినకు! జలుబు చేస్తుంది!" చెట్టుకింద నించి వసంత మాటలు వినబడ్డాయి.

కొమ్మల ఆకులు పక్కకితీసి, చెట్టుమీది నించి కిందకి చూశాను. "నేను నీకు కనబడుతున్నానా?" అడిగాను.

"ఓ కనబడకేం?" కళ్ళు గుండ్రంగా తిప్పుతూ అంది.

నైల్లాను పట్టుచీర. ముదురు నీలం బ్లవుజు. నుదుట ఎర్రని తిలకం. మామూలు కంటే పొడగరే! కాని చెట్టుమీద నించి చూస్తే పొట్టిగా అవుపిస్తోంది. ఆకాశాన్నీ, సూర్యకాంతినీ పువ్వుల మెత్తదనంతో కలిపి రంగరించినట్టుగా వుంది. మెత్తని పచ్చిక సుకుమారమైన ఆమె కాళ్ళ కింద నలుగుతోంది.

"ఓహ్; డివైన్‌గా వున్నావు!! తింటావా?" ఒక కాయని విసిరేస్తూ అన్నాడు.

"ఇక దిగు! నాకు కావలిస్తే నేనే రాళ్ళు విసిరి కాయలు కొట్టుకుంటాన్లే! నువ్వేం ఇవ్వనక్కర్లా!" అంది వంగి కాయ తీసుకుంటూ. నవ్వాను.

చెట్టు దిగుతోంటే "ఏమంత ఎత్తుంది?

కొమ్మ పట్టుకుని కిందికి దూకలేవూ?" అడిగింది.

"అయ్య బాబోయ్! నావల్లకాదు! కిందికి పడతానేమోనని భయం!....అగాధాల్ని చూస్తే జడుసుకుంటాను. అదో ఫోబియా నాకు!" అన్నాను చెట్టు దిగుతూ.

"అదో, ఆ పండు దోరగా వుంది. ర్రాయి అందివ్వు, దాన్నిపడగొడ్తాను!" అంది చెట్టు మీదికి చూస్తూ.

తెల్లకొంగలు ఆకాశంలో ఎగురుతున్నాయి. దూరంగా ప్రవహిస్తున్న పంట కాలవలో నీళ్ల ఎండలో మిలమిలా మెరుస్తున్నాయి. చెట్ల గుబురుల్లోంచి అరమైలు దూరంలో రథం గోపురం కనిపిస్తోంది.

చిన్న రాయినితీసి అందించాను. గిలిగింతలు పెట్టినట్టు నా చేతిని తాకుతూ రాయిని తీసుకుంది. రాయి విసిరింది, పండు పడలేదు.

"నేనిచ్చిన పండు తిను! బాగానే వుందిగా. వెళ్దాం పద! వంటలేమైనా అయ్యాయేమో! ఈ చెట్లలోంచి నడిచి వెళ్ళడానికి పావుగంట అవుతుంది" అన్నాను. మౌనంగా అనుసరించింది నేను ముందు నడుస్తుంటే.

"ఆడవాళ్ళమీద వుట్టినే స్కాండల్స్ చెబుతారు," అంది వెనక నడుస్తూ.

"ఎవరి గురించి అంటున్నావూ?" అడిగాడు.

"ఉహు! వుట్టినే అంటున్నాను. ఎంతో ఫ్రీడమ్, అవకాశాలు వుండి కూడా మగాడు చెడిపోవడంలేదు. అలాంటిది ఆడదెలా చెడుతుంది—యిన్ని కట్టుబాట్లూ, యిన్ని బాధలూ వుండి?"

"పొరబాటు! మొదటిసారి చెడడమే కష్టం. తర్వాత రాతిని కొండకిందికి దొర్లించినట్టే! దానికి ఆడా, మగా అన్నభేదం వుంటుందనుకోను!" అన్నాను.

"బాబోయ్!'' అని అరిచింది బాధగా కొంత దూరం నడిచాక.

"ఏమిటి? ఏమయింది?" ఆందోళనగా వెనక్కి తిరిగి చూశాను.

"ఆ ఆకుల్లోంచి పాము కనబడింది!" భయంగా వెనక్కి వెళ్తూ అంది. ఆగి నేనూ చూశాను. తళతళా మెరుస్తూ నేలబడ్డ యెండుటాకుల్లోంచి జరజరా ప్రాకుతూ వెళ్తోంది పాము. త్రాచులాగే వుంది. భయంకరమైన ఆ అందాన్ని చూస్తూ నిలబడ్డాను.

"అబ్బా!" అని మూలిగింది.

మళ్ళీ తనవేపు తిరిగాను. "ఏమయింది!"

"ముల్లు!'' అని అరిచింది కూలబడుతూ.

బొటన వేలికి ముల్లు గుచ్చుకుంది. లావుపాటి ముల్లు. లాగేశాను. రక్తం జివ్వున చిమ్మింది. ఎడమచేత్తో నొక్కిపట్టాను. రక్తం కట్టలేదు.

"ఉండు! చన్నీళ్ళు తెస్తాను!" కోనేటి దగ్గరికి వెళ్ళడానికి బయల్దేరాను.

"నే ఉండను! నాకు భయం! పాములున్నాయిక్కడ!" నేను పరుగెత్తుతోంటే వెనకనించి వినబడ్డాయి ఆమె మాటలు. "ఫర్లేదు! ఇప్పుడే వచ్చేస్తాను!" గాలిలో చెయ్యి ఊపుతూ కోనేటి దగ్గరకి పరిగెత్తాను. హాండ్‌కర్చీఫ్‌ని నీళ్ళలో ముంచి తెచ్చను.

తిరిగి వచ్చేసరికి అలా గడ్డిమీదే కూర్చుని వుంది. బొటన వేలిని పిండుతూ వుంది. రక్తం బొట్లుబొట్లుగా వస్తూంది. "ఎందుకలా గాయాన్ని పిండుతున్నావ్?" కసురుకున్నాను. "వూరుకుంటే రక్తం ఈపాటికి గడ్డకట్టి ఆగిపోయేది!" అన్నాను.

తలెత్తి నన్ను చూసి నవ్వింది. నేను వంగి కాలు పట్టుకోబోతోంటే విసురుగా కాలు పక్కకి తీసింది. రక్తపుబొట్లు ఒకటి, రెండు చీరమీద పడ్డాయి.

"కదలకు! చూడు, చీరమీద మరకలయ్యాయి!" అన్నాను.


"ఆ హాండ్ కర్చీఫ్ యిలాతే! నేను వేలికి చుట్టుకుంటాను!" అంది.

"అదేం?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"నువ్వేమో ముట్టుకుంటే కందిపోతావన్నట్టు ప్రవర్తిస్తున్నావ్. ఇంక ఈ రక్తం ఏం కట్టుతుంది?" అంది.

రెండుచుక్కల చన్నీళ్ళు గాయంమీద






పిండి, హాండ్‌కర్చీఫ్‌ని అవిడకే యిచ్చాను. "పోనీ నువ్వే చుట్టుకో వేలికి!" అన్నాను.

కాసేపయ్యాక "ఇక వెళ్దామా?" అనడిగాను. చీరమీద రక్తపు మరకల్ని తడిగుడ్డతో తుడుస్తూ "పద!" అంది.

"ఈ కర్చీఫ్ మీ మేనకోడలిదిలా వుంది!" అంది. పసుపు పచ్చని సిల్కు హాండ్‌కర్చీఫ్ అది. అంచులు ఎర్రదారంతో హెమ్మింగ్ చేయబడి వున్నాయి. ఒక మూలన యెర్ర దారంతో 'యస్' అన్న అక్షరం ముద్ద కుట్టు కుట్టి వుంది?

"ఆఁ! అది యిచ్చిందే. సరూకి నేనంటే అదోరకం వెర్రి!" అన్నాను.

"నువ్వు సింహానివోయ్!"అంది నా పక్కనే నడుస్తూ.

"ఇంకా నయం! నక్కని అన్నావుగాదు!" అన్నాను నవ్వుతూ.

"సింహాలు వేటాడకుండా కళ్ళు మూసుకుని కూచుని వుంటాయిట. ఇది ఏమీ చెయ్యదులే అని జంతువులు ధైర్యంగా దగ్గరికి వస్తే చటుక్కున వాటిని పట్టుకుని తినేస్తాయట!!" అంది.

"ఇండియాలో సింహాలు అంతేలే! వాటి కూడా మనలాగే బద్ధకం యెక్కువ!" అన్నాను.

ఆమె నవ్వింది. పళ్ళు తళుక్కుమన్నాయి. కళ్ళు నీటిపొరతో నిండి సౌజన్యమేఘాలలాగా సూర్యరశ్మితో మిలమిలా మెరిశాయి, "ఎంత మంచి సింహమైనా, నిర్భయంగా జంతువులు దగ్గరకి వస్తాయేతప్ప, నన్ను తినేసెయ్యి అని నోట్లో పడవు తెలుసా!?" అంది.

"స్వామిభక్తి ఎక్కువ మోతాదులో వుంటే అలా చేసినా చెయ్యొచ్చు!" అన్నాను.

"ఆ మాత్రమైనా వేటాడకపోతే అది సింహమే అనిపించుకోదు!" అంది.

"అంతేమరి!" అన్నాను.

అయిదేళ్ళయింది. ఈ మధ్యకాలంలో డిగ్రీ తీసికుని యూనివర్శిటీ వదలి వచ్చేశాను. ఏదో వున్నంతలో మంచి ఉద్యోగమే వచ్చింది.

యూనివర్శిటీలో వుండగా నాలుగైదుసార్లు వసంత వుత్తరం రాసింది. ఏదో మామూలు కబుర్లు. ఉత్తరం చివర్లో "మై డియర్ సూర్యం

XXX" అని రాసేది. ఒకసారిమాత్రం "నేను XXX అని రాస్తే జవాబు రాయవేం?" అని రాసింది. "Xకి జవాబు Yయా?" అని రాశాను నేను. మళ్ళీ ఉత్తరాలు రాయలేదు వసంత. ఉద్యోగంలో చేరిన కొత్తలో పెళ్ళి పత్రిక అందింది. వెళ్ళడానికి వీలులేక గ్రీటింగ్స్ టెలిగ్రాం పంపించాను.

కొన్నాళ్ళయాక నా పెళ్ళి సర్దాతో జరిగి పోయింది. హనీమూన్‌కి వెళ్ళిరావడమూ, బంధువుల ఇళ్ళన్నీ చుట్టబెట్టడమూ అంతా రెండు నెలలయింది. మళ్ళీ వచ్చి డ్యూటీలో చేరాను. నెల్లాళ్ళు వెతికాక నాకు నచ్చిన ఇల్లు దొరికింది. వెంటనే సరోజని పిలుచుకొచ్చేశాను. అత్తయ్య మాతో వచ్చి రెండు నెలలుండి వెళ్ళిపోయింది.

ఆరునెలలు పైగానే గడిచిపోయాయి. సరూకి గృహిణిగా తన బాధ్యతలేమిటో అప్పుడప్పుడే అర్థమవుతున్నాయి. నాకూ యింటి యజమాని బాధ్యత కొత్త కొత్తగా, బెరుకు బెరుగ్గా వుంది. వసంత వస్తున్నానని వుత్తరం రాసింది. కళ్ళడాక్టరు దగ్గరకెళ్ళి కళ్ళు పరీక్ష చేయించుకుని వచ్చాక అందింది ఆ ఉత్తరం. నాకు చిన్నప్పటి నుంచీ వుంది దృష్టిదోషం. ఒక యాంగిల్‌లో సరిగా కనబడదు. ఆస్టిగ్‌మాటిజమ్ అన్నాడు డాక్టరు. ఏవో మందులిచ్చాడు. కళ్ళజోడు వాడాలన్నాడు. ఉత్తరం చదివి సరూకి అందించాను చదవమని.

స్టేషన్‌కి వెళ్ళి రిసీవ్ చేసుకున్నాం. "నువ్వు ఇన్వైట్ చెయ్యకపోయినా మిమ్మల్ని చూడ్డానికి వచ్చాను" అంది వసంత. "ఇన్‌వైట్ చేస్తే వచ్చేవాళ్ళు బంధువులు. మిత్రులకి అలాంటి అడ్డంకులు లేవు. ఎప్పుడన్నా నిరభ్యంతరంగా రావొచ్చు!" అన్నాను. నా మాటల్ని బలపరుస్తున్నట్టుగా నవ్వింది సరూ. ఇంతకీ ఈవిడ యింతదూరం ఎందుకొచ్చింది? మమ్మల్ని చూడ్డానికేనా? చూసి సంతోషించడానికా, అసూయపడడానికా? నాకు అంతుపట్టలేదు.

"కళ్ళజోడు ఎప్పట్నించీ వాడుతున్నావ్?" అనడిగింది.

"ఈ మధ్యనే డిఫెక్ట్ ఎక్కువైంది. డాక్టరు వాడమన్నాడు" అన్నాను.

రెండో రోజులయింది వసంత వచ్చి. ఆ సాయంత్రం ఇంటికొచ్చేటప్పటికి సరూకి బాగా జ్వరం వచ్చింది. పనితో అలిసిపోయివున్న నేను, "ఉదయానే డాక్టరు దగ్గరికి తీసికెళ్దాంలే!" అనుకున్నాను. సరూ బాగా దగ్గిదగ్గి, హై టెంపరేచర్‌తో వొళ్లు తెలియనట్టు పడిపోయింది. ఫరవాలేదు, ఉదయానికి జ్వరం తగ్గిపోతుంది అనుకున్నాను.

వసంతే నాకు అన్నం వడ్డించింది. కొసరి, కొసరి దగ్గరుండి అన్నం వడ్డిస్తూంటే తృప్తిగా తిన్నాను. తల్లి కొడుక్కి అన్నం తినిపించినంత ప్రేమగా వడ్డించింది. మిసిమి ఛాయ వొంటిమీద రెండు సన్నని బంగారు గాజులు. మధ్య నీలం గాజులు. ఎంతో అందంగా నప్పాయి. గోళ్ళకి నెయిల్ పాలిష్.... సన్నని పొడుగాటి చేతులు. సుకుమారమైన వేళ్ళు. "వసంతని పెళ్ళిచేసుకుని వుంటే బావుండు నేమో!" ననిపించింది నాకు మొదటిసారిగా.

"తాగడం గట్రా నీకు అలవాటు లేదల్లే వుంది!" అంది వసంత.

"అబ్బే! నాకు బొత్తిగా గిట్టదు!" అన్నాను.


"మా ఆయనే నయం! నీ అంత పెద్ద వుద్యోగం చెయ్యకపోయినా, ఎలాగో పార్టీలంటూ వారానికోసారన్నా పూటుగా తాగుతారు" అని నవ్వింది. కళ్ళలో సీటీపొర జాలిగా మెరిసింది.

వాళ్ళాయన ఏదో ఆఫీసరు. జీతం తక్కువైనా బాగనే గడిస్తాట. వాళ్లు కొన్న ఫర్నిచరూ, వాళ్ళకున్న ప్ల్యాన్లూ, దర్జా అంతా చెప్పింది.

"నువ్వేం యిలాగున్నావు?" అనడిగింది

"ఇలాగేమిటి? ఈ ఉద్యోగం యింతే! మాకు గడింపు అంటూ వుండదు. ఉన్నదాంట్లో సరుకోవాలి!" అన్నాను భోజనం దగ్గర్నించి లేస్తూ. వార్తలు విని, గదిలోకెళ్ళి పడుకున్నాను.






రాత్రంతా సరూకి ఏవో సపర్యలు చేస్తూనే వుంది వసంత. నేను నిద్రమత్తులో పట్టించుకోలేదు. నా గదిలోకి కూడా రెండు మూడుసార్లు వచ్చినట్టు గుర్తు. ఎలక్ట్రిక్ స్టవ్ నా గదిలోనే వుంది. నీళ్లు కాచుతోంది కాబోలు. స్విచ్చి వేసినప్పుడంతా మెలకువ వచ్చేది. మళ్ళీ నిద్ర పట్టేసేది ఆ క్షణంలోనే.

ఉదయానే నిద్రలేపింది. "ఏమిటా మొద్దు నిద్ర! పెళ్ళానికి అలా వుంటే. లేచి డాక్టరు దగ్గరికి తీసికెళ్ళు!" అంది. స్నానం చేసినట్టుంది. తడితడిగా వున్న వెంట్రుకలు వదులుగా ముడివేసుకుంది. కడిగిన ముత్యంలా స్వచ్ఛంగా వుంది. ఒకే ఒక్క క్షణం ప్రలోభంలో పడిపోయాను. చేతులు చాచబోయాను. భయంకరమైన ఆ స్వచ్ఛత ఛెళ్లున చెంపపెట్టు పెట్టినట్టనిపించింది. బద్ధకంగా లేచాను, ఆవులిస్తూ.

డాక్టరు దగ్గర్నించి వచ్చేసరికి టిఫిన్ చేసి రడీగా వుంచింది. "డాక్టరేమన్నాడు?". అనడిగింది. చెప్పాను. సరూని తీసికెళ్ళి పడుకోబెట్టింది. నేను టిఫిన్ ముగించి వచ్చేసరికి "గ్రాండ్ కాన్యన్" ఫొటోని చూస్తూ విలబడింది. ఆఫీసుకు వెళ్ళడానికి బట్టలు వేసుకుంటుంటే "దీన్ని ఫోటో కట్టించావేం?" అని అడిగింది.

స్పాన్‌లో పడిన చిత్రం. బావుందని ఫోటో కట్టించాను "అందంగా లేదూ!" అన్నాను.

"అగాధాలంటే భయం అన్నావు కదా!" అనడిగింది.

ఎప్పటిదో ఆ మాట. నాకు జ్ఞాపకం కూడా లేదు. ఆవిడ అంటోంటే ఆ మాటలు నావేనని లీలగా గుర్తుకొచ్చింది. "అయినా అది ఎంతో అట్రాక్టివ్‌గా వుంది కదూ!" మాట మార్చి అన్నాను.

"నేను ఉత్తరాల్లో XXX అని రాస్తే జవాబివ్వలేదేం?" అనడిగింది

అతిప్రయత్నం మీద యూనివర్శిటీ రోజులు గుర్తుకు తెచ్చుకున్నాను. "X అంటే ఏమిటి? నాకు తెలియలేదు!" అన్నాడు.

"ఓరి వెర్రినాయనా! X అంటే తెలియదా! సెక్సులో చివరి అక్షరం. సెక్సు అదుంటేగాని పూర్తి కాదు!" అని నవ్వింది.

నేనూ నవ్వేశాను. "ఔను. నాకు తట్టనే లేదు సుమా! నేను అంత డీప్‌గా ఆలోచించ లేను. పైపైనే వూహించగలను. చెప్పానుగా. అగాధాలన్నా, అగాధంవంటి ఆలోచనలన్నా నాకు భయం!" అన్నాను.

రెండు రోజులు పోయాక వెళ్ళాలంటూ వసంత బయలుదేరింది. సరూకి యింకా నీరసం తగ్గలా. "సర్దాగా వచ్చారు కానీ, నావల్ల మీకు యిక్కడ చాకిరీ తప్పలేదు" అంది సరూ, వసంతతో.

"అలా అనుకునేదాన్నయితే, ఇక్కడికి వచ్చివుండేదాన్నే కాదు" అంది వసంత.

నీరసంగా వున్నా సరూ వసంతకి అన్ని మర్యాదలూ చేసి సాగనంపింది.

*       *       *

ఇది మూడేళ్ళ క్రిందటి మాట.

రెండు నెలల క్రిందట సరూ వాళ్ళ నాన్న గారికి బాగులేదని చూడ్డానికి వాళ్ళ వూరెళ్ళింది. ఆమె తిరిగ రావడానికి ఇంకా కొన్నాళ్ళు పడుతుంది. ఆఫీసు ప్యూన్‌తో కారియర్ తెప్పించుకుంటూ, రాబిన్సులాంటి వేడి పుస్తకాలు నంజుకుంటూ రోజులు వెళ్ళమారుస్తున్నాను.

వసంతా వాళ్ళకి యీలోగా యిక్కడికే ట్రాన్స్‌ఫర్ అయింది. ఫర్లాంగు దూరంలో. రెండువీధుల అవతల ఇల్లు తీసుకున్నారు. సరూ లేదని వసంత చాలా నొచ్చుకుంది. సరూ లేకపోయినా, వాళ్ళందరికీ స్వాగతం చెప్పినట్టుగా వుంటుందని హోటల్ సవేరాలో వాళ్ళకి డిన్నరిచ్చాను. సరూ వచ్చాక మరో మంచి డిన్నర్ ఏర్పాటు చేస్తానని కూడా ప్రామిస్ చేశాను.

"అబ్బ! ఇంత పెద్ద హోటల్ని గురించి పుస్తకాల్లో చదివానేమోగానీ, కలలోనైనా చూళ్ళేదు సుమా! అంది వసంత.

"నిజానికిలాంటి హోటల్ బెంగుళూరులో వుండవలసింది!" అన్నాడు మూర్తి, వసంత భర్త.

నేను ఆర్డరు చేసిన విచిత్రమైన డిషెస్ అన్నీ తన ఇద్దరు పిల్లలలాగానే ఉత్సాహంగా ఆనందంగా తిన్నది.

"అమ్మయ్య! బిల్లు భలేబరువుగా వుంటుందనుకుంటా నీకు! పొట్టలే యింత బరువైపోతేనూ!" అంది.

వారం రోజుల తర్వాత, ఈ రాత్రి ఇక్కడ వసంత!

అవకాశం అంటోంది, ఉపయోగించుకోవడం అంటోంది. ఏమిటో ఆవిడ ధోరణి. నాకంతు బట్టలా.

"చూడు! గడ్డిపోచమీద నిల్చిన మంచు బిందువులో కలల ఇంద్రధనుస్సులు విరుస్తాయి. తాకితే ఆ ప్రపంచమే విధ్వంసమైపోతుంది. నేను సౌందర్యాన్ని ఆరాధిస్తానని నీకు తెలుసు కదా!" అన్నాను.

వసంత మాట్లాడలేదు. "అవకాశాలకేం? కల్పించుకుంటే బోలెడు దొరుకుతాయి. ముఖ్యమైన అవకాశాన్ని ఎప్పుడో పోగొట్టుకున్నను తెలిసో, తెలియకో! అందుకు యిప్పుడు బాధ ఎందుకు?" అన్నాను.

కాసేపు నిశ్శబ్దం అవహించింది. "సూర్యం! నాకు అర్థమైంది! నువ్వు ప్రిగిష్ ఫూల్‌వి! సరూ యెలా చేస్తోందో నీవంటి వాడితో సంసారం ... వస్తాను! కుర్రాళ్ళు నిద్ర లేస్తారేమో! ఆయన కేంపు కెళ్ళారు!"

చివాల్న తలుపు తెరుచుకుని వెళ్ళిపోయింది. నేను ఒంటరిగా మిగిలిపోయాను, రాజ్యాన్ని పోగొట్టుకున్న చక్రవర్తిలా.

వసంత! అందం, చైల్డిష్‌నెస్, స్త్రీత్వం, అసూయ, లాలిత్యం, డేరింగ్, కవిత్వం, జనరాసిటీ, తెలివి, చురుకుదనమూ—ఓహ్! ఎన్నో చెప్పలేను. అన్నీ తలబోసిన మిశ్రమం. ఆమె నాకు అర్థం అవుతుందా?

గ్రాండ్ కాన్యన్ ఫోటో చూస్తున్నాను. అట్రాక్టివ్‌గా వుంది. భయంకరంగానూ వుంది. ఇదొక లవ్-హేట్ రిలేషన్‌షిప్! అంతేనేమో!



# మరుభూమి

కళింకోట ప్రభాకరదేవ్

పవిత్రులు అపవిత్రులు,ధనవంతులు,దరిద్రులు, పెద్దలు, పిన్నలు అనే తారతమ్యం లేకుండా చివరకక్కడ అందరూ మట్టిలో కలిసిపోవల్సిందే. మనిషి జీవనయాత్ర కది చివరి మజిలీ. విభిన్న జీవితాలపాలిట సమవర్తి! సమదర్శి!!

శవం కాలుతున్న వాసన—

ఎండిన జమ్మిచెట్టుమీద తీతువుపిట్ట కూర్చుని మనిషి అంతిమస్థానానికి నేపథ్య గీతం ఆలపిస్తున్నట్టుగా అరుస్తుంది.

చితి రగుల్కొంటుంది....

'జీవి' ఊర్ధ్వలోకానికి పయనిస్తున్న[illegible]మో నన్న భ్రమను స్ఫురింపచేస్తూ....చితిమంటలు మింటికెగుస్తున్నాయి.

చితిలోకి మండుతున్న కట్టెల్ని యాంత్రికంగా నిర్లిప్తంగా ఎంకడు ఎగదోస్తున్నాడు.

ఎంకడు కాటికాపరి.

నలభై సంవత్సరాల వయస్సుంటుంది. నల్లగా, సన్నగా....మాడిపోతున్న శవంలాగ వుంటాడు. వాణ్ని చూడగానే "పాపం వీడు తిండితిని ఎన్ని వారాలయివుంటుందో!" అనే జాలి కలుగుతుంది.

మొలకు, గాంధీ కట్టుకునే గావంచాలాంటిది మినహా వాడి వొంటిమీద మరే ఆచ్ఛాదనా వుండదు.

స్మశానాన్ని నమ్ముకుని బ్రతుకుతున్నాడు. ఇంతవరకూ వాడు తగులబెట్టిన శవాలు వేల సంఖ్యలో వుంటాయి. భయాన్ని, దుఃఖాన్ని కలిగించే శవాలు ఎంకడికి ఆనందాన్ని కలిగిస్తాయి. శవం స్మశానానికి వచ్చిందంటే, వారాల తరబడి పస్తున్న కుక్కకు ఎండురొట్టె దొరికినంతగా సంబరపడిపోతాడు ఎంకడు.

స్మశానమే వాడి లోకం—

ఆ లోకంలో అడపాదడపా ఆకలి కొంత చల్లారుతుంది. అదే పదివేలనుకుంటూ ఇన్నాళ్ళూ బ్రతికేశాడు. అయితే, ఈ మధ్య గత కొన్ని దినాలుగా వాడి మనసులో దిగులు మొదలయింది.

ఏదో వెలితి వాడి మనసును చికాకు బరుస్తూ వుంది. ఎంకడు తన గురించి ఎన్నడూ బాధపడలేదు. ఆలోచించలేదు. ఇప్పుడూ అంతే. వాడి దిగులుకుగల కారణం 'ఈరిగాడు'.

ఈరిగాడు ఎంకడికి వొకేవొక బంధం. 'ఈరిగాడు' అంటే ఎంకడికి అందుకనే ప్రాణం. ఈ లోకంలో తనవారంటూ వున్నది 'ఈరిగాడు' మాత్రమేనన్న ఆపేక్షకొద్ది వాడ్ని కంటికి రెప్పలాగ చూసుకుంటూ వచ్చాడు.

'ఈరిగాడు' తల్లి పచ్చిబాలింతలోనే కన్ను మూసేసింది. ఆ శవాన్ని దహనం చేసింది కూడా ఎంకడే.

అయిదవ ఏట పిల్లలకు అక్షరాభ్యాసం చేయించినట్లుగా 'ఈరి'గాడికి అయిదవ సంవత్సరం రాగానే చితిలోకి కట్టెల్ని ఎగదొయ్యడం....శవాన్ని కాల్చడం మొదలైన వాటికి శ్రీకారం చుట్టించాడు ఎంకడు. అయితే, వయస్సొస్తున్నకొద్ది ఈరిగాడికి తను చేస్తున్న పని నచ్చలేదు.

స్మశానికి కొద్ది దూరంలోగల బంజరు భూముల్లో పశువుల్ని మేపటానికి వచ్చే పిల్లల్ని చూసి, వాళ్ళలాగే తను కూడా ఎవరి పశువులన్నా కాపలాకాస్తే బాగుండుననుకున్నాడు.